క్లుప్తంగా

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించాలి

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 245 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలాల వారీగా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల వివరాలను వెల్లడించారు. ఒంగోలు 19, నాగులుప్పలపాడు 25, దొనకొండ 6, దర్శి 2, కంభం 20, మార్కాపురం 11, యర్రగొండపాలెం 8, కొమరోలు 16, గిద్దలూరు 29, కనిగిరి 16, చీరాల 22, ఇంకొల్లు 12, యద్దనపూడి 5, వెలిగండ్ల 18, హనుమంతునిపాడు 9, అర్ధవీడు 2, పుల్లల చెరువు 2, రాచర్ల 6, కొత్తపట్నం 3, కొరిశపాడు 5, జే పంగులూరు 8, అద్దంకి 3 చొప్పున ఉపాధ్యాయులను నియమించేందుకు డీఈవో సీనియార్టీ లిస్టు తయారు చేసి కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

21న గురజాడ, బోయి భీమన్న జయంతి సభ

ఒంగోలు మెట్రో: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ ఉదయం పది గంటలకు ఒంగోలులోని మంగమూరు రోడ్డులో గల శివాజీ నగర్ రెండోవీధిలో సింహాద్రి జ్యోతిర్మయి ఇంటి వద్ద హాలులో తెలుగు భాష మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న 114వ జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డా.నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్య అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం కాపాడుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా - 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు తమ కుటుంబ సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ఆస్టర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొని పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఒంగోలు ఈఎస్‌ఐ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఎస్‌ఐ కార్పొరేషన్ ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ సత్యప్రకాష్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు చింతపల్లి గోపి, నగర పాలక సంస్థ సిబ్బంది, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని అన్ని స్వయం సహాయక సంఘాలు తమ సమావేశాలను ఫెన్సింగ్, ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ సూచించారు. ఒంగోలు టీటీడీసీ వెలుగు, డీఆర్‌డీఏ ఏపీఎంలు, సీసీలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎంబీకే 2.0లో గ్రూపుల లావాదేవీలను పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను స్త్రీనిధి ద్వారా మండలాలకు కేటాయించారని, ఆ నిధిని నిరుపేద మహిళలకు రుణాలుగా ఇచ్చి సరైన పద్ధతిలో రికవరీ చేయాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం రుణాల రికవరీలు చేసి రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి మానవత్వం


క్షతగాత్రులకు ధైర్యం చెప్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మానవత్వం చాటుకున్నారు. గురువారం తాడేపల్లిలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని తిరిగి యర్రగొండపాలెం వస్తున్న సమయంలో పల్నాడు జిల్లా కోటప్పకొండ రోడ్డులోని యడవల్లికి సమీపంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో మోటారు బైక్ యాక్సిడెంట్ జరిగింది. ఆ బైక్‌పై మద్దిరాలకు చెందిన దంపతులు చిలకలూరిపేటకు వెళ్తున్నారు. రోడ్డుపై పెద్ద గుంత ఉన్న విషయాన్ని గమనించకుండా ముందుకు వెళ్లారు. దీంతో ఆ బైక్ గుంతలో పడటంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి రోడ్డుపై పడి ఉన్న వారిని కూర్చోబెట్టి ధైర్యం చెప్పారు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా తక్షణ స్పందన లేకుండా పోయింది. ప్రమాద స్థలానికి 108 వాహనం చేరేందుకు 50 నిమిషాలు పడుతుందని సమాధానం రావడంతో ఆ వెంటనే ఒక ఆటోను పిలిపించి క్షతగాత్రులను ఎమ్మెల్యే తాటిపర్తి దగ్గరుండి వైద్యశాలకు తరలించారు.


ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం

వర్షంతో విలవిల..!

- ఒంగోలులో పలు ప్రాంతాలు జలమయం
- అవస్థపడిన ప్రజలు


కొద్దిపాటి వర్షానికే నగరంలోని రోడ్లపై నిలిచిన నీరు

ఒంగోలు టౌన్/ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని పలు ప్రాంతాలు వర్షానికి జలమయం కావడంతో ప్రజలు అవస్థపడ్డారు. పలు ప్రధాన రోడ్లపై సైతం వర్షం నీరు భారీగా నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి నీరు చేరుతోంది. భారీ వర్షం కురిస్తే కాలువలు పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు అవస్థపడుతున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఒంగోలు 13వ డివిజన్‌లోని కబాడిపాలెంలో యెష్కోలు చర్చి రోడ్డులో భారీగా నీరు నిలిచి గృహాల్లోకి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు పడుతుండటంతో కాలువలు పొంగి రోడ్డు మీదకు, అనంతరం గృహాల్లోకి వర్షం నీరు వస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది కాలువలను శుభ్రం చేయకపోవడం వలన వర్షాల సమయంలో నీరు సక్రమంగా ప్రవహించక ఈ దుస్థితి నెలకొంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలి...

నగరంలో కొద్దిపాటి వర్షానికే ప్రధాన వీధులతో పాటు అనేక కాలనీల్లోని రోడ్లు జలమయం అవుతున్నాయని, మోకాలి లోతు నీళ్లు ప్రవహిస్తుండడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయపడిపోతున్నారని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని భాగ్యనగర్, మార్కెట్ సెంటర్, కొత్తపట్నం బస్టాండు సెంటర్, బైపాస్ రోడ్డులో మోకాలి లోతున నీరు ప్రవహించిందని తెలిపారు. వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద చెరువును తలపిస్తూ వర్షం నీరు నిలుస్తోందని, దాంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. పాదచారులు నడిచేందుకు వీలులేకపోగా ఆటోలు, మోటారు బైకులు వెళ్లడానికి ఇబ్బందిగా మారిందన్నారు. స్మార్ట్ సిటీ, అమృత పట్టణ పథకాల కింద కూడా డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడం, ఉన్న డ్రైనేజీల్లో సకాలంలో చెత్త, మురుగు తొలగించకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోందన్నారు. నగరాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న పాలకులు, అధికారులు దీనికి బాధ్యత వహించాలన్నారు. పోతురాజుకాలువ పూడికతీత పనులు మధ్యలోనే ఆగిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. కాలువల్లోని పూడికను పూర్తిగా తొలగించి మురుగు నీరు, వర్షం నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడికల్ కాలేజీ వద్ద నిరసనలో ఎస్ఎన్ పాడు నాయకులు


మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు


ఆందోళన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ మహిళా నేతలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని, పీపీపీ విధానం వద్దని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, ఎంపీపీ నలమలపు విజయ, నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, శ్రీమన్నారాయణ, అవినాస్, సుధాకర్, వినోద్, మహిళా నేతలు లక్ష్మి, సీతమ్మ, కుమారి, శేషిరెడ్డి, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో క్రైం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తే పోలీసుల పట్ల ప్రజలలో గౌరవం పెరుగుతుందని చెప్పారు. శుక్రవారం నగరంలోని వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, రూరల్ పోలీసు స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఆ సమయంలో ఫిర్యాదు చేయడానికి వచ్చి బయట నిలబడి ఉన్న వారితో మాట్లాడారు. పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన.. సీజ్ చేయబడిన వాహనాలను చూసి వివరాలడిగి తెలుసుకున్నారు. కోర్టు అనుమతి తీసుకుని వాహనాలను డిస్పోజ్ చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్లలో క్రైం మ్యాప్‌లను పరిశీలించారు. పోలీసు రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలడిగి తెలుసుకున్నారు. మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్లు, లాకప్ గదులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకుని కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రాంతాలపై నిరంతరంగా డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని ఆదేశించారు. మార్కెట్ ఏరియాలో డ్రోన్ కెమెరాలతో పాటు సీసీ కెమెరాలను ఉపయోగించి పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. బహిరంగంగా మద్యం సేవించేవారిని, అల్లర్లకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని ఆదేశించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, తాలూకా సీఐ విజయకృష్ణ, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఉన్నారు.

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

- హ్యాండిల్ లాక్ వేయడం మరవొద్దు
- స్వీయ జాగ్రత్తలు అవసరమంటున్న పోలీసులు


బైకు చోరీ చేస్తున్న యువకుడు

పెద్దదోర్నాల: ద్విచక్ర వాహనాల దొంగతనాలు ప్రజలను కలవరానికి గురి చేస్తున్నాయి. ఇళ్లు, బస్టాండ్‌లు, సినిమా హాళ్లు, ప్రార్థనాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, కళాశాలలు ఇలా ఎక్కడ వాహనాలు నిలిపినా అవి క్షణాల్లో మాయమవుతున్నాయి. విలాసాలు, మత్తు వంటి దురవాట్లకు బానిసలైన యువకులు దారి తప్పి చోరీలకు పాల్పడుతున్నారని పోలీసు అధికారులు చెబుతున్నారు. లక్షలు పోసి కొన్న ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు గురవుతుండటంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. దీంతో పాటు తమ వాహనాలు దొంగతనానికి గురి కావడానికి హ్యాండిల్ లాక్, వీల్ లాక్‌లు వేయక పోవటం వంటి నిర్లక్ష్యం కూడా చోరీలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో తరుచూ చోటు చేసుకుంటున్న ద్విచక్ర వాహనాల దొంగతనాలపై వాహన యజమానులు కొన్ని స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

సరిహద్దు జిల్లాలకు తరలి వెళ్తున్న బైకులు

జిల్లాలో పెద్దదోర్నాల మండలం సరిహద్దు మండలంగా ఉంది. మండలం నుంచి ఓ వైపు 30 కిలో మీటర్లు వెళ్తే నంద్యాల జిల్లా ఆత్మకూరు, మరో వైపు 10 కిలో మీటర్లు వెళితే శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలు ఉన్నాయి. దీంతో పాటు మరో పది కిలో మీటర్లు వెళ్తే.. తెలంగాణ ప్రాంతం వస్తుంది. ఈ నేపథ్యంలో చోరీకి గురైన వాహనాలు జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మండల కేంద్రంలోని ప్రార్థనాలయం ఎదుట యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి రాత్రి బస చేశాడు. మరుసటి రోజు ఉదయం యువకుడి వాహనం మాయమైంది. చోరీకి గురైన ఈ వాహనం విలువ సుమారు రెండు లక్షల రూపాయలకు పైగానే ఉంటుందని వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగతనానికి గురైన ద్విచక్ర వాహనాన్ని నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు.

వాహనదారులు స్వీయ జాగ్రత్తలు పాటించాలి:

“ ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామంది వాహనదారులు తమ బైక్‌లకు హ్యాండిల్ లాక్, వీల్ లాక్‌లు వేయక పోవటం వల్లే వాహనాలు చోరీకి గురవుతున్నాయి. దీంతో పాటు నిర్మానుష్య ప్రాంతాలు, సీసీ టీవీలు లేని చోట వాహనాలను ఎక్కువ సేపు నిలపటం మంచిది కాదు. కొందరు వాహనాలకు తాళాలు అలాగే వదిలి వెళ్తున్నారు. జీపీఎస్ ట్రాకర్లు, అలారం సిస్టం వంటి అధునాతన భద్రత వినియోగించుకోవాలి.

– మహేష్, ఎస్సై, పెద్దదోర్నాల,

గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులపై జల్లెడ పట్టాలి


మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రావ్య

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతాలలో మహిళల వ్యాధులపై జల్లెడ పట్టి నివారించడానికి వైద్యసిబ్బంది సహకరించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మధుసూదన్ ఆదేశించారు. స్వస్థ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపట్నం రెడ్డిపాలెంలో 30 ఎలిమెంటరీ స్కూల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాకాని వెంకట శ్రావణి అధ్యక్షత వహించగా, మధుసూదన్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు స్వస్థ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంప్ పెట్టి వ్యాధులను గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తిస్తే వారి ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, గర్భాశయ సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. 14 నుంచి 50 సంవత్సరాల మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకుని మందులు పంపిణీ చేశారు. ఎనీమియా, బాల్య వివాహాలు, రక్తహీనత గురించి జిల్లా కళా జాతా ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావ్య, అంగన్‌వాడీ సిబ్బంది, సీహెచ్‌వో ఓంకారం, సూపర్‌వైజర్లు ఇందిరాదేవి, సులోచనారాణి, పి.ప్రభాకర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వోలు), ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎఫ్‌టీ పరికరాల ప్రారంభం


పీఎఫ్‌టీ పరికరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

ఒంగోలు టౌన్: ఊపిరితిత్తుల వ్యాధులను నిర్ధారించే పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (పీఎఫ్‌టీ) పరికరాన్ని ఒంగోలు జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సర్వజన ఆస్పత్రిలో పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాలలో ఏర్పాటు చేసిన మూడు పీఎఫ్‌టీ పరికరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా గాలిలోని ఆక్సిజన్‌ను ఊపిరితిత్తులు ఏ పరిమాణంలో గ్రహిస్తున్నాయో నిర్ధారిస్తామన్నారు. ఊపిరితిత్తులపై వ్యాయమం ఏ స్థాయిలో ప్రభావం చూపుతుందో తెలుసుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. పొగ తాగే అలవాటున్న వారిలో ఊపిరితిత్తుల పనితీరును నిర్ధారిస్తాయని చెప్పారు. పీజీ నిధుల కింద వచ్చిన 50 లక్షల రూపాయలతో ఈ వైద్య పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ కె.అద్దెయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్లు తిరుపతిరెడ్డి, ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఆర్ఎంఓ మాధవీలత, పల్మనాలజీ హెచ్‌ఓడీ రామస్వామి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ పద్మలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు దుర్గా ప్రసాద్, కుమారవర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ రంజిత్ బాషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ


ఎరువులు పంపిణీ చేస్తున్న పూనాటి వెంకట్రావు

చీమకుర్తి: చీమకుర్తి వ్యవసాయ సహకార సంఘం ద్వారా ప్రెసిడెంట్ పూనాటి వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. రైతులు పండించిన ధాన్యం, కందులు, సజ్జలు, మొక్కజొన్న పంటలను కూడా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సొసైటీ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. వాటితో పాటు పలు రకాల పంట రుణాలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, కందిమళ్ల గంగాధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం


విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాకు చెందిన కె.సమీక్ష అనే విద్యార్థిని నీట్‌లో ఉత్తీర్ణురాలై కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. పేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు శుక్రవారం రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. స్థానిక సమితి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగేంద్రరావు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో నిరుపేద మాదిగ కుటుంబానికి చెందిన విద్యార్థిని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో ఉండి విద్యనభ్యసించి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందించదగిన విషయమన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండటం వలనే పేద విద్యార్థులకు ఉచిత సీట్లు వస్తున్నాయన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను భాగస్వామ్య పద్ధతిలో నిర్వహించనుండటం వలన కన్వీనర్ కోటా సీట్లు తగ్గి మేనేజ్‌మెంట్ సీట్లు పెరుగుతాయన్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో రిజర్వేషన్లు ఉండవనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై విద్యార్థులకు శిక్షణ


పరిశ్రమను సందర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దిపాడు: విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు వృత్తి విద్య దోహదపడుతుందని కారుమూడివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మండవ ప్రభాకర్ అన్నారు. పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న 42 మంది బాలికలు శుక్రవారం పరిశ్రమల విజిట్లో భాగంగా కుంకుపాడు వద్ద గల కల్లమ్ టెక్స్ టైల్స్‌ను సందర్శించారు. విద్యార్థులకు వస్త్ర తయారీలో వివిధ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వృత్తి విద్య ఉపాధ్యాయులు ఎం.లక్ష్మి, డి.కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు పి.ఉషారాణి, కె.వి.నాగరాజుకుమారి, ఎం.శైలజ పాల్గొన్నారు.